సాక్షి గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

శనివారం | 4 | ఫిబ్రవరి | 2023



అసిస్టెంట్ రిజిస్ట్రార్ల అంతర్గత బదిలీలు

కేయూలో ముగ్గురు అసిస్టెంట్ రిజిస్ట్రార్లను అంతర్గతంగా బదిలీలు చేస్తూ రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు.

- 8లో



రైల్వే వ్యాగన్ షెడ్‌కు రూ.160కోట్లు

కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కాజీపేట జంక్షన్‌కు రైల్వేపరంగా నిధులు కేటాయించినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

- 8లో

గరిష్టం/కనిష్టం
32.0^0 / 14.0^0

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి సాయంత్రం వరకు మేఘాలతోపాటు సూర్యరశ్మితో వేడిగా ఉంటుంది. వాతావరణం పొడిగా ఉంటుంది. రాత్రిపూట చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రేపు జిల్లాస్థాయి బాల్ బ్యాడ్మింటన్ ఎంపికలు

వరంగల్ స్పోర్ట్స్: జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఈనెల 5న ఉమ్మడి వరంగల్ జిల్లాస్థాయి సబ్ జూనియర్స్ బాలబాలికల బాల్ బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఉమ్మడి వరంగల్ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి వీరన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఈనెల 10 నుంచి 12వ తేదీ వరకు నిజామాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఆదివారం ఉదయం 9 గంటలకు జేఎన్‌ఎస్‌లోని బ్యాడ్మింటన్ గ్రౌండ్ వద్ద రిపోర్టు చేయాలని పేర్కొన్నారు. ఇతర వివరాల కోసం 98492 01467 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

సదస్సును విజయవంతం చేయాలి



విద్యారణ్యపురి: విద్యాపరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో హనుమకొండ ప్రభుత్వ డైట్ కళాశాలలో జాతీయ విద్యా విధానంపై ఈనెల 5న నిర్వహించబోయే విద్యా సదస్సును విజయవంతం చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్ పిలుపునిచ్చారు. శుక్రవారం హనుమకొండలోని సంఘ కార్యాలయంలో నిర్వహించిన విద్యాపరిరక్షణ కమిటీ జిల్లాస్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో జాతీయ విద్యావిధానం-2020 అమలు చేస్తున్న క్రమంలో ప్రజాస్వామ్య, లౌకిక విలువలు, సౌభ్రాతృత్వానికి తావులేకుండా పోతుందన్నారు. నూతన విద్యావిధానంతో ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ, కాషాయీకరణ పెరిగిపోతుందన్నారు. రాష్ట్రంలో విద్యారంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. 10 శాతం విద్యార్థులకు ఉపయోగపడే విధంగా గురుకులాలను ఏర్పాటు చేసి.. 90 శాతం విద్యార్థులకు ఉపయోగపడుతున్న పాఠశాలలను నిర్వీర్యం చేస్తున్నారన్నారు. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందనే నెపంతో 1,300 పాఠశాలల్లో ఉపాధ్యాయ ఖాళీలను బదిలీల్లో చూపకుండా వాటి మూసివేతకు పూనుకుందన్నారు. పాఠశాలల మూసివేతను వ్యతిరేకిస్తూ ఈనెల 5న హనుమకొండ ప్రభుత్వ డైట్ కళాశాలలో మధ్యాహ్నం 2 గంటలకు జరిగే విద్యాసదస్సును విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు జి.వెంకటేశ్వర్లు, కార్యదర్శి పూజారి మనోజ్, జె.స్వామి, ఉపాధ్యక్షుడు అజయ్‌బాబు, బాధ్యులు వీరభద్రం, వెంకట్, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

కాజీపేట అర్బన్: జిల్లాలోని అన్ని కళాశాలల్లో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ, వికలాంగ ఫ్రెష్, రెన్యువల్ విద్యార్థులకు పోస్ట్‌మెట్రిక్, ఫీజు రీయింబర్స్‌మెంట్ దరఖాస్తుల గడువు మార్చి 31వ తేదీ వరకు పొడిగించినట్లు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ డీడీ నిర్మల ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జిగా మనీషా మెహ్రో

వరంగల్ లీగల్: వరంగల్ జిల్లా రెండో అదనపు కోర్టు కమ్ ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జిగా మనీషా మెహ్రోను నియమిస్తూ హైకోర్టు అధికారిక వర్గాలు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశాయి. ఇప్పటివరకు ఈ స్థానంలో ఉన్న జడ్జి పావనిని ఒకటో అదనపు జిల్లా జడ్జిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. నియామకమైన న్యాయమూర్తులు సంబంధిత ఇన్‌చార్జ్ నుంచి బాధ్యతలు స్వీకరించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రెడ్‌క్రాస్ రాష్ట్ర చైర్మన్‌ను కలిసిన కలెక్టర్



హన్మకొండ అర్బన్: జిల్లాకు వచ్చిన రెడ్‌క్రాస్ రాష్ట్ర చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి అజయ్ మిశ్రాను నిట్‌లో కలెక్టర్ సిక్తా పట్నాయక్ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలో చేపడుతున్న పలు కార్యక్రమాలపై చర్చించారు. రెడ్‌క్రాస్ రాష్ట్ర పాలక మండలి సభ్యులు ఈవీ.శ్రీనివాస్‌రావు, జిల్లా ప్రతినిధి పాపిరెడ్డి పాల్గొన్నారు.

జవాన్లు.. జలగలు!

కార్మికుల నుంచి నెలవారీ వసూళ్లు

వాళ్లు నిత్యం పరిశుభ్రత కోసం పాటుపడతారు. ఎండనకా, వాననకా చెత్త శుద్ధికోసం చిత్తశుద్ధితో పని చేస్తారు. ఉద్యోగ భద్రత లేదు. ఆరోగ్యాలకు భరోసా లేదు. ఉన్నతంగా ఎదుగుతామనే ఆశా లేదు. కేవలం కుటుంబాల్ని పోషిస్తే చాలనుకునే వాళ్లను సైతం వదలకుండా జేబులు నింపుకుంటున్నారు కొందరు జవాన్లు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు. ముక్కు పిండి మరీ వసూళ్లు చేస్తున్నారు. ప్రశ్నించిన కార్మికులను టార్గెట్ చేస్తూ కాసులు జేబుల్లో వేసుకుంటున్నారు. - వరంగల్ అర్బన్



- ప్రశ్నిస్తే ఉద్యోగం ఊస్ట్
- ఇదీ గ్రేటర్ పారిశుద్ధ్య కార్మికుల దైన్య స్థితి

ఈ అవినీతి జవాన్లు పెద్దగా చదువుకోకపోయినా కార్మికుల స్థాయి నుంచే పైరవీలతో పోస్టులను దక్కించుకొని చెలామణీ అవుతున్నారు. వరంగల్ మహా నగరాన్ని పారిశుద్ధ్య కార్మికులు నిత్యం పరిశుభ్రంగా ఉంచుతుండగా.. 460 మెట్రిక్ టన్నుల చెత్త సేకరణలో వీరి పాత్ర కీలకం. వీరిపట్ల కొంత మంది జవాన్లు, ఇన్‌స్పెక్టర్లు జలగల్లా మారారు. ప్రతీ నెల కార్మికుల నుంచి డబ్బులు తీసుకోవడం హక్కులా భావిస్తున్నారు. ఒక్కో కార్మికుడు నెలంతా సెలవుల్లేకుండా పని చేస్తే రూ.15,600 వేతనం వస్తుంది. పీఎఫ్ 12 శాతం, ఈపీఎఫ్ 0.75 శాతం పోను రూ.13,683 వస్తుంది. అందులో సెలవులు మినహాయిస్తే సగటున ఒక్కో కార్మికుడి వేతనం రూ.11వేల నుంచి రూ.12వేలు చేతికందుతుంది. కార్మికులకు వేతనం చేతికందడం ఆలస్యం నెలకు రూ.500 నుంచి రూ.1,000 చొప్పున జవాన్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే.. చీదరింపులు, వేధింపులు, వెక్కిరింతలు, దబాయింపులను కార్మికులు ఎదుర్కోవాల్సిందే..

కాసుల గలగల..

జవాన్లకు మించి శానిటరీ ఇన్‌స్పెక్టర్లు వసూళ్ల పర్వం నడిపిస్తున్నారు. ఒక్కో పర్మినెంట్ కార్మికుడు వేలి ముద్ర వేసి వెళ్తే.. బదిలీ కార్మికుడిని పెట్టినా నెలకు రూ.3వేల నుంచి రూ.8వేలు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు తీసుకుంటున్నారు. నగర పరిధిలో 66 డివిజన్లున్నాయి. 2,758 మంది ఔట్ సోర్సింగ్ పారిశుద్ధ్య కార్మికులున్నారు. అందులో 80 మంది జవాన్లుగా పని చేస్తున్నారు. మరో 50 మంది వరకు డిప్యుటేషన్‌పై పని చేస్తున్నారు. బల్దియాలో మొత్తం అధికారికంగా, అనధికారికంగా 140 మంది వరకు జవాన్లు ఉన్నారు. డ్రైవర్లు, వాహనాలపై పని చేసే కార్మికులు మినహా ఒక్కో డివిజన్‌కు 25 నుంచి 35 మంది పని చేస్తున్నారు. వాస్తవానికి డివిజన్‌కు ఒక జవాన్ విధులు నిర్వహించాల్సి ఉండగా.. ఇద్దరు నుంచి ముగ్గురు చొప్పున లెక్కకు మించి పర్యవేక్షిస్తున్నారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పిలిస్తే పలికేలా జవాన్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి.



నగర వీధుల్లో బల్దియా పారిశుద్ధ్య కార్మికులు

వ్యాపకాలెక్కువ!

జవాన్లు ఉదయం వేళల్లో బయోమెట్రిక్ యంత్రాల్లో హాజరు తీసుకోవడం, కార్మికులకు పనులు అప్పగించడం, పర్యవేక్షిస్తుంటారు. అందులో భాగంగా వ్యాపార, వాణిజ్య సముదాయాల్లో తినుబండారాల షాపుల్లో ట్రేడ్ లైసెన్స్, యూజర్ చార్జీల సొమ్ము వసూళ్లతోపాటు ఇతర వ్యాపకాల్లో నిమగ్నమవుతున్నారు. చిరువ్యాపారులు, తినుబండారాల దుకాణాలు, హోటళ్లు, మటన్, చికెన్ షాపుల నిర్వాహకుల నుంచి ప్రతి నెలా జవాన్లు మామూళ్లు తీసుకుంటున్నారు. నిత్యం చెత్తలో పనిచేసే కార్మికులను సైతం వదలడం లేదు. స్థానిక ప్రజాప్రతినిధుల ఇళ్లల్లో, వ్యక్తిగత పనుల్లోకి కార్మికులను పంపిస్తూ, వారి సేవల్లో తరిస్తున్నారు. కొంత మంది శానిటరీ ఇన్‌స్పెక్టర్లు కార్మికులను వ్యక్తిగత సహాయకులుగా, ద్విచక్ర వాహనాలను నడిపేందుకు వాడుకుంటున్నారు. రాబందుల్లా మారిన జవాన్లను గుర్తించి చర్యలు తీసుకోవాలని కార్మికులు విజ్ఞప్తి చేస్తున్నారు. బల్దియా పాలకవర్గం పెద్దలు, ఉన్నతాధికారులు కార్మికుల బాగోగులపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.



సారలమ్మ గద్దెలపై మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

మనసారా మొక్కులు

మేడారానికి పోటెత్తిన భక్తులు

సమ్మక్క-సారలమ్మలను దర్శించుకునేందుకు భక్తులు శుక్రవారం తరలివచ్చారు. ములుగు జిల్లా మేడారంలో జరుగుతున్న మినీ జాతరకు తెలంగాణలోని పలు ప్రాంతాలతోపాటు వివిధ రాష్ట్రాల నుంచి జనం వచ్చి మనసారా మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో గద్దెల ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. వనదేవతలను పలువురు అధికారులు దర్శించుకున్నారు. - ఎస్ఎస్ తాడ్వాయి

- 8లో

వాహనాలకు వెహికిల్ ట్రాకింగ్ సిస్టమ్

గ్రేటర్ కమిషనర్ ప్రావీణ్య

సాక్షి ఎఫెక్ట్

వరంగల్ అర్బన్: బల్దియా పారిశుద్ధ్య వాహనాలకు వెహికిల్ ట్రాకింగ్ సిస్టమ్స్ చిప్స్‌ను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేశారు. 'ఇంధన దోపిడీ, వెహికిల్ ట్రాకింగ్ సిస్టమ్'పై గత నెల 2న 'సాక్షి' దినపత్రికలో కథనం ప్రచురితమైన విషయం విదితమే. దీనిపై స్పందించిన కమిషనర్ ప్రావీణ్య.. వెహికిల్ ట్రాకింగ్ సిస్టమ్‌ను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయకపోవడంపై అసహనం వ్యక్తం చేయడంతోపాటు ఎంహెచ్‌ఓ రాజేష్‌ను నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. దీంతో వాహనాల పనితీరును పరిశీలించిన ఎంహెచ్‌ఓ చిప్స్ ఉన్నా పరిగణనలోకి తీసుకోవడం లేదని, మరికొన్నింటికి లేవని నివేదిక సమర్పించారు. నిర్దేశించిన రూట్లలో వాహనాలు ఎన్ని కిలోమీటర్లు తిరగాలని, ట్రిప్పులు లెక్క వేయాలని, లేదంటే ఆయా డ్రైవర్ల జీతభత్యాలను తగ్గించాలని కమిషనర్ ఆదేశించారు. వెహికిల్ ట్రాకింగ్ సిస్టమ్ ద్వారా వాహనాల రవాణాను పరిగణనలోకి తీసుకొని, రీడింగ్ ఆధారంగా డీజిల్ కేటాయింపులు చేపట్టాలని సూచించారు.





అసెంబ్లీలో మన ఎమ్మెల్యేలు

హైదరాబాద్‌లో శాసనసభ సమావేశాలకు శుక్రవారం హాజరవుతున్న ఎమ్మెల్యేలు దాస్యం వినయ్‌భాస్కర్, అరూరి రమేశ్, చల్లా ధర్మారెడ్డి.

అగ్గితో జర జాగ్రత్త!

- పరిశ్రమలు, గోదాములు, హోటళ్లు, ఆస్పత్రుల్లో ఫైలం
- అగ్నిమాపక నిబంధనలు పాటిస్తేనే ప్రమాదాలకు ఆస్కారం లేదు
- గతంలో టెస్కో గోదాం.. తాజాగా ఓల్డ్ ఫర్నిచర్ షాపులో అగ్నిప్రమాదం
- వేసవి కాలం వస్తుండడంతో మరిన్ని జాగ్రత్తలు అవసరం

సాక్షి, వరంగల్: వేసవి కాలం వస్తుందంటే చాలు.. పరిశ్రమలు, గోదాములు, టింబర్ మిల్లులు, ఫర్నిచర్ దుకాణాలను అగ్ని ప్రమాదాలు భయపెడతాయి. ఏమాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా.. భారీ ఆస్తి నష్టంతోపాటు ప్రాణనష్టం కూడా జరిగే అవకాశం ఉంటుంది. ఖిలా వరంగల్ మండలంలోని ఇసుక అడ్డా జంక్షన్ పెరుకవాడలోని ఓల్డ్ ఫర్నిచర్ షాపులో శుక్రవారం తెల్లవారు జామున అగ్ని ప్రమాదంతో ఆస్తి నష్టం జరిగింది. ప్రాణనష్టం లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఈ నేపథ్యంలో రానున్నది వేసవి కాలం కావడంతో పరిశ్రమలు, గోదాములు, టింబర్ మిల్లులు, హోటళ్లలో అగ్నిమాపక నియంత్రణ చర్యలు పాటించాల్సిన అవసరం కనబడుతోంది. గతేడాది ఏప్రిల్ 13న ఓ గోదాంలో టెస్కోకు చెందిన రూ.28కోట్ల విలువైన జంపఖానాలు, తివాచీలు, ఇతర వస్తువులు అగ్నికి ఆహుతైన సంగతి తెలిసిందే. ఈ రెండు ఘటనల్లోనూ షార్ట్ సర్క్యూట్ అని అధికారులు చెబుతున్నా.. ఇవి జరగకుండా ఉండేందుకు సిబ్బంది అప్రమత్తం కావాల్సిన అవసరాన్ని నొక్కిచెబుతోంది.

ప్రమాదాలు ఎలా జరుగుతాయంటే..

వరంగల్, హనుమకొండ జిల్లాల పరిధిలో సుమారు వివిధ రంగాలకు చెందిన 95 పరిశ్రమలు, మరో 70 గోదాములున్నాయి. గీసుగొండ మండలం గొర్రెకుంటలోని ప్రగతి పారిశ్రామిక వాడలో అత్యధికంగా ఇవి ఉన్నాయి. ఆయా గోదాముల సామర్థ్యం సుమారు ఐదువేల మెట్రిక్ టన్నులు ఉంటుంది. వీటిలో పత్తి, జిన్నింగ్, ప్రెస్సింగ్ చేసిన బేళ్లు, పీడీఎస్ బియ్యం, ఎరువులు, కందులు, బార్దాన్ సంచులను నిల్వ చేస్తారు. అయితే పరిశ్రమల్లో నిషేధించిన స్థలాల్లో సిగరెట్లు తాగడం, విద్యుత్ పరికరాల్లో షార్ట్ సర్క్యూట్, ఓవర్ లోడింగ్, లూజు వైరింగ్‌తో మండే స్వభావం గల పదార్థాలు లీక్ కావటం, పొర్లడం, వెల్డింగ్, కటింగ్, ఇతర వేడిమిని పుట్టించే పనులు, పరిశ్రమలోని యంత్రాలను సరిగా మెయిన్‌టెన్ చేయకపోవడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోకపోవటంతో అగ్ని ప్రమాదాలు జరుగుతాయని వివిధ రకాల ఘటనలు చెబుతున్నాయి.



దగ్ధమవుతున్న ఓల్డ్ ఫర్నిచర్ షాపు

ప్రమాదాల నివారణకు..

విద్యుత్ పరికరాల పనితీరును తరచూ పర్యవేక్షించాలి. సులభంగా మండే పదార్థాలను ఇగ్నిషన్ సోర్సెస్ నుంచి దూరంగా ఉంచాలి. చమురు, గ్యాస్ లీక్‌లను సమర్థంగా అరికట్టాలి. మరమ్మతు చేయాలి. రసాయనాలను ఒక దగ్గర కాకుండా వేర్వేరుగా నిల్వ చేయాలి. ఫైర్ డ్రిల్లులను మూడు నెలలకోసారి నిర్వహించాలి.

గోదాముల్లో జాగ్రత్తలు పాటించాల్సిందే..

గోదాముల్లో తగినన్ని అగ్నిమాపక యంత్రాలు ఏర్పాటు చేయాలి. నిర్దేశించిన సమయంలో వాటిని పరిశీలించి వాటి గడువు తేదీని కచ్చితంగా లేబుల్‌పై రాసి ఉంచాలి. హోజ్ రీల్ హోజ్, హైడ్రెంట్ వాల్వులు, డెలివరీ హోజులు తప్పనిసరిగా అమర్చుకోవాలి. మాన్యువల్‌గా పనిచేసే అలారం సిస్టమ్‌తోపాటు స్ప్రింక్లర్లు, డిటెక్టర్లు కచ్చితంగా అమర్చి వాటి పనితీరును పరిశీలించాలి. ఫైర్ పంపులను అమర్చి అవి అన్ని వేళలో ఆటోమెటిక్‌గా స్టార్ట్ అయ్యేటట్టు ఏర్పాటు చేసి ఉంచాలి. గోదాముల్లో వంట వండడం, ఎల్‌పీజీ సిలిండర్ వాడొద్దు, వర్కర్లు నిద్రించొద్దు.

జాగ్రత్తలతోనే ప్రమాదాల నివారణ

వేసవి కాలంలో ఎక్కువగా అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. పరిశ్రమలు, గోదాముల నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలి. పరిశ్రమలు, గోదాం నిర్వాహకులతోపాటు జనరద్దీ ఉండే ఆస్పత్రులు, హోటళ్లు కూడా అగ్ని ప్రమాద జాగ్రత్తలను పాటించాలి. అగ్ని ప్రమాదాల నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పిస్తాం. అగ్ని ప్రమాదం జరిగితే 101 నంబర్‌కు సమాచారం అందించాలి.

- భగవాన్‌రెడ్డి, అగ్నిమాపక శాఖ ఉన్నతాధికారి

ఎగిసిపడిన అగ్ని కీలలు - వివరాలు 8లో

ముగిసిన దరఖాస్తుల ప్రక్రియ

- బదిలీలకు హనుమకొండ జిల్లాలో 621.. వరంగల్‌లో 1,048 దరఖాస్తులు
- నేడు దరఖాస్తు చేసిన టీచర్ల సర్టిఫికెట్ల పరిశీలన

విద్యారణ్యపురి: ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఈనెల ఒకటిన ముగిసింది. హనుమకొండ జిల్లాలో ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్లు, లాంగ్వేజ్ పండిట్లు, పీఈటీలు, పీఎస్ హెచ్‌ఎంలు, పీజీ హెచ్‌ఎం కేటగిరీల టీచర్లు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన వారు 621 మంది ఉన్నారు. వీరు దరఖాస్తు చేసిన హార్డ్ కాపీలను డీఈఓ కార్యాలయంలో అందజేశారు. ఆయా టీచర్లు ఈనెల 4న హనుమకొండ డీఈఓ కార్యాలయంలో దరఖాస్తుల తనిఖీ కోసం ఒరిజినల్ సర్టిఫికెట్లు, సర్వీసు బుక్స్‌తో ఉదయం 9 గంటల నుంచి రావాలని డీఈఓ అబ్దుల్ హై శుక్రవారం కోరారు. అందుకు 8 ప్రత్యేక కౌంటర్లను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పీహెచ్‌సీ కేటగిరీ వారు తప్పనిసరిగా సదరం సర్టిఫికెట్లు తీసుకొని రావాలన్నారు. స్పౌజ్ కేటగిరీ వారు జీఓ నం.5 ప్రకారం ఈ ఏడాది జనవరి 25 రూల్ ఏబీసీడీఈఎఫ్‌జీలో కవర్ అయ్యేలా అన్ని డాక్యుమెంట్లు తీసుకొని రావాలన్నారు. ఇప్పటికే సీనియారిటీ జాబితాలను సంబంధిత వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. అభ్యంతరాల స్వీకరణ కొనసాగుతోంది. శుక్రవారం పాఠశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ సర్వీసెస్ మదన్‌మోహన్ డీఈఓ కార్యాలయాన్ని సందర్శించి.. టీచర్ల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియకు సంబంధించిన పలు విషయాలను డీఈఓను అడిగి తెలుసుకున్నారు. అలాగే హనుమకొండలో పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి కూడా డీఈఓ కార్యాలయాన్ని సందర్శించారు.



డీఈఓ వాసంతికి వినతిపత్రం సమర్పిస్తున్న టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, ఇతర బాధ్యులు

వరంగల్ జిల్లాలో 1,048 దరఖాస్తులు

వరంగల్ జిల్లాలో ఎస్‌జీటీలు, స్కూల్ అసిస్టెంట్లు, లాంగ్వేజ్ పండిట్లు, పీఈటీలు, పీఎస్ హెచ్‌ఎంలు, పీజీ హెచ్‌ఎంలు తదితర కేటగిరీలు కలిపి మొత్తంగా 1,048 మంది టీచర్లు బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్నారని డీఈఓ వాసంతి తెలిపారు. దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ కొనసాగుతోంది.

పారదర్శకంగా నిర్వహించాలని వినతి

జిల్లాలో చేపట్టనున్న టీచర్ల బదిలీలు, పదోన్నతులు పారదర్శకంగా నిర్వహించాలని, ఎలాంటి అక్రమాలకు తావివ్వొద్దని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్, జిల్లా అధ్యక్షుడు జి.వెంకటేశ్వర్లు, కార్యదర్శి మనోజ్, జిల్లా కమిటీ సభ్యులు ఎం.వెంకట్, ఎం.గోపాల్ శుక్రవారం వరంగల్ డీఈఓ వాసంతికి వినతిపత్రం సమర్పించారు. స్పౌజ్ కేటగిరీ, మెడికల్ కేటగిరీలతో బదిలీలకు దరఖాస్తు చేసిన వారి ధ్రువపత్రాలు క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు.

అర్హులైన ఎస్‌ఏల సీనియారిటీ లిస్టు వెల్లడి

మల్టీజోన్-1 పరిధిలో 19 జిల్లాలకు సంబంధించిన గ్రేడ్-2 హెచ్‌ఎం పదోన్నతులకు అర్హులైన స్కూల్ అసిస్టెంట్ల(లోకల్ బాడీ కేటగిరీ) సీనియారిటీ జాబితాలను సంబంధిత వెబ్‌సైట్‌లో శుక్రవారం హనుమకొండలోని పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ ఉంచారు. ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలో గ్రేడ్-2 హెచ్‌ఎంల పదోన్నతులకు స్కూల్ అసిస్టెంట్ల సీనియారిటీ జాబితాను వెల్లడించిన విషయం విదితమే. అభ్యంతరాల స్వీకరణ కూడా కొనసాగనుంది.

కంటి పరీక్షలు చేయించుకోవాలి



కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న జిల్లా న్యాయమూర్తులు కె.రాధాదేవి, ఎం.కృష్ణమూర్తి

వరంగల్ లీగల్: అర్హులైన ప్రతీ ఒక్కరు కంటి వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకోవాలని వరంగల్, హనుమకొండ జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు కె.రాధాదేవి, ఎం.కృష్ణమూర్తి అన్నారు. శుక్రవారం వరంగల్, హనుమకొండ న్యాయసేవాధికార సంస్థలు, జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టు అవరణలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమాలను వారు ప్రారంభించారు. అనంతరం వారితోపాటు న్యాయమూర్తులు, న్యాయవాదులు, న్యాయ శాఖ ఉద్యోగులు, సిబ్బంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. న్యాయమూర్తులు ఎం.వెంకటేశ్వరరావు, వరంగల్, హనుమకొండ జిల్లాల న్యాయసేవాధికార సంస్థల కార్యదర్శులు జె.ఉపేందర్‌రావు, శ్రీనివాసులు, చండీశ్వరీదేవి, డీఎంహెచ్‌ఓ సాంబశివరావు, డాక్టర్ మదన్మోహన్‌రావు, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆనంద్‌మోహన్, శ్రీనివాస్‌గౌడ్, డాక్టర్ మల్లిక, హరిత, గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు కోపమొచ్చింది..

- డీఎఫ్ఓ వసంతపై ఫైర్
- 70 దరఖాస్తులకు ఇంకా ఎన్ని రోజులు చేస్తారు..
- ఆదిలాబాద్‌లో వేలల్లో చేశాం.. అంటూ చురక

హన్మకొండ అర్బన్: 'జిల్లాలో రెవెన్యూ అధికారులు, గ్రామ డివిజన్ స్థాయి కమిటీలు అందించిన ప్రతిపాదనల మేరకు 70 ఆర్ఓఎఫ్ఆర్ దరఖాస్తులు ఆమోదించడానికి మేం సిద్ధంగా ఉన్నాం. వాటిని తిరస్కరించడానికి మీ దగ్గర సరైన కారణాలు లేవు. కనీస సమాచారం లేకుండా జిల్లాస్థాయి సమావేశానికి ఎలా వచ్చారు. మీ డిపార్ట్‌మెంట్ రివ్యూ మీటింగ్ అనుకున్నారా.. కనీస సమాచారం లేకపోతే ఎలా.. ఏమనుకుంటున్నారు..' అంటూ డీఎఫ్ఓ వసంతపై కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి తగిన సమాచారంతో రావాలని ఆదేశించారు. జిల్లాలో ఆర్ఓఎఫ్ఆర్ దరఖాస్తుల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి కమిటీ సమావేశం శుక్రవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ సమగ్ర సమాచారం తెలుసుకున్నారు. జిల్లాలో కేవలం శాయంపేట మండలానికి చెందిన 5 గ్రామాలు ఎంపిక చేసి.. వాటిలో 4 గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. మొత్తం 777 దరఖాస్తులు రైతుల నుంచి రాగా.. వాటిలో 87 దరఖాస్తులు మాత్రమే ప్రతిపాదిస్తూ డివిజన్ స్థాయి కమిటీకి పంపించామని కలెక్టర్‌కు వివరించారు.

70 దరఖాస్తులకు ఎన్ని రోజులు?

డివిజన్ కమిటీ.. జిల్లా కమిటీకి సమగ్ర సమాచారంతో ప్రతిపాదించారని రెవెన్యూ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ క్రమంలో సహేతుకమైన కారణాలు చెప్పకుండా అటవీ అధికారులు ఆ దరఖాస్తులు తమ శాఖ ఆమోదించడం లేదని తెలపడంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 70 దరఖాస్తులను పరిశీలించి.. పరిష్కారం చేయడానికి ఎన్ని రోజులు చేస్తారని ప్రశ్నించారు. ఆదిలాబాద్ లాంటి జిల్లాలో వేల సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయని, అక్కడ పనులు అటవీ, రెవెన్యూ అధికారులు వేగంగా పూర్తి చేశారని అన్నారు. ఉన్నతాధికారులతో మాట్లాడి ఆర్ఓఎఫ్ఆర్ దరఖాస్తుల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మొదటి సమావేశంలో అటవీ అధికారులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేయడంతో మిగతా అధికారుల్లో వణుకు మొదలైంది. సమావేశంలో పరకాల ఆర్డీఓ రాము, శాయంపేట తహసీల్దార్ రాజు, ఏసీ సంధ్యారాణి, అధికారులు పాల్గొన్నారు.

విభజన హామీల అమలుకు పాదయాత్ర | కండీషన్‌కు అనుగుణంగా బస్సులు నడపాలి | రవాణా శాఖలో మెరుగైన సేవలందించాలి - వివరాలు 10లో

క్లుప్తంగా

వీనస్ జ్యువెల్లరీ ఎగ్జిబిషన్‌కు విశేష స్పందన



ఆభరణాలు కొనేందుకు వచ్చిన మహిళలు

హన్మకొండ చౌరస్తా: నగరంలోని బస్టాండ్ రోడ్డులో గల వీనస్ జ్యువెల్లరీ షోరూంలో శుక్రవారం ప్రారంభమైన జ్యువెల్లర్స్, డైమండ్స్ ఎగ్జిబిషన్ అండ్ సేల్స్‌కు నగర ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తున్నట్లు జ్యువెల్లరీ చైర్మన్ రవిచంద్ర తెలిపారు. అన్ని రకాల వెరైటీలు డిస్కౌంట్ ధరలకే అందిస్తున్నట్లు రవిచంద్ర తెలిపారు. శని, ఆదివారాల్లో కూడా ఈ ఎగ్జిబిషన్ సేల్ అందుబాటులో ఉంటుందని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

అసిస్టెంట్ రిజిస్ట్రార్ల అంతర్గత బదిలీలు

కేయూ క్యాంపస్: కేయూలో ముగ్గురు అసిస్టెంట్ రిజిస్ట్రార్లను అంతర్గతంగా బదిలీలు చేస్తూ, సెక్షన్లు మార్పు చేస్తూ కేయూ రిజిస్ట్రార్ టి.శ్రీనివాస్‌రావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆడిట్ ఆఫీసర్‌గా పని చేస్తున్న శ్రీలతను అకౌంట్స్ విభాగంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా బదిలీ చేశారు. ఆర్ట్స్‌అండ్ సైన్స్ కళాశాలలో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా పని చేస్తున్న కిష్టయ్యను కేయూలోని ఆడిట్ విభాగానికి ఆడిట్ ఆఫీసర్‌గా బదిలీ చేశారు. పబ్లికేషన్ సెల్ ఇన్‌చార్జ్‌గా అదనపు బాధ్యతలనూ అప్పగించారు. కేయూ పబ్లికేషన్ సెల్ డైరెక్టర్‌గా పని చేస్తున్న అసిస్టెంట్ రిజిస్ట్రార్ నర్సింహారావును ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలకు బదిలీ చేస్తూ రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీ చేశారు.



జాతకం చెబుతున్న కోయదొరలు



కుర్రో.. కుర్రు..

ఎస్‌ఎస్ తాడ్వాయి: కుర్రో కుర్రు. ఉన్నది ఉన్నట్లు చెబుతా.. జరిగింది చెబుతా.. జరిగేది చెబుతా.. అంటూ మేడారంలో శుక్రవారం కొందరు కోయ దొరలు భక్తులకు జోష్యం చెప్పారు. మినీజాతర సందర్భంగా కోయ దొరలు ప్రత్యేక వేషధారణలో వనమూలికలతో కనిపించారు. భక్తులు వారి వద్దకు వెళ్లి జాతకం చెప్పించుకున్నారు.

నీటిని బాటిళ్లలో నింపుతున్న భక్తులు



జలధార..

సమ్మక్క కొలువైన చిలుకలగుట్ట నుంచి జలధార వస్తుంది. మేడారం వచ్చిన భక్తులు ఈ నీటిని పవిత్ర జలంగా భావించి నెత్తిన చల్లుకుంటున్నారు. ఇళ్లకు తీసుకెళ్తున్నారు. చిలుకలగుట్టపై ఉన్న వన మూలికలను తాకుతూ వచ్చే జలధార నీటిని తాగితే ఆరోగ్యానికి మంచిదనేది భక్తుల విశ్వాసం. దీంతో భక్తులు ఆనీటి కోసం క్యూ కడుతున్నారు.

తీరొక్క మొక్కులు..



మేడారానికి వచ్చిన భక్తులు చెట్ల కింద సేద తీరుతున్నారు. భక్తులు విడిది చేసిన చోటే అమ్మవారి ప్రతిరూపాలను పసుపు, కుంకుమలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. కుటుంబ సమేతంగా పూజలు చేసి ఆతర్వాత అమ్మవార్ల గద్దెలకు చేరుకొని మొక్కులు చెల్లించుకుంటున్నారు. మరికొంత మంది భక్తులు నూతన వస్త్రాలు ధరించి అమ్మవారి ఒడి బియ్యాన్ని తయారు చేశారు. శుక్రవారం బస చేసిన చోటో పూజలు నిర్వహించి గద్దెల వద్ద మొక్కులు చెల్లించుకున్నారు.

పోటెత్తిన భక్తజనం



సమ్మక్క గద్దె వద్ద మొక్కులు అప్పజెప్పున్న భక్తులు



సమ్మక్క గద్దె వద్ద భక్తురాలి పూనకం

- కిటకిటలాడిన అమ్మవార్ల గద్దెల ప్రాంగణం
- దారి పొడవునా వాహనాల బారులు

ఎస్‌ఎస్ తాడ్వాయి: సమ్మక్క, సారలమ్మను దర్శించుకునేందుకు భక్తులు శుక్రవారం మేడారానికి పోటెత్తారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలు, ఇతర రాష్ట్రాలకు చెందిన భక్తులు మేడారానికి తరలివచ్చారు. భక్తులు జంపన్నవాగు వద్ద పుణ్యస్నానాలు ఆచరించారు. సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద అమ్మవార్లకు పూజలు నిర్వహించి మనసారా మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రాకతో గద్దెల ప్రాంగణం కళకళలాడింది. కోరిన కొర్కెలు తీర్చాలని అమ్మవార్లకు భక్తులు ముడుపులుకట్టారు. గంట మోతతో గద్దెల ప్రాంగణం మార్మోగింది. వివిధ ప్రాంతాల భక్తుల రాకతో మేడారం కిక్కిరిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తుల రద్దీ కొనసాగింది. మొక్కుల అనంతరం భక్తులు మేడారం పరిసరాల్లో చెట్ల కింద వంటలు చేసుకున్నారు. సహపంక్తి భోజనాలు చేసి సేదతీరారు.



శివసత్తుల నృత్యాలతో అమ్మవారి దర్శనానికి వస్తున్న భక్తులు

పకడ్బందీ ఏర్పాట్లు

భక్తుల రద్దీ నియంత్రణకు పోలీసులు చర్యలు తీసుకున్నారు. దొంగతనాలు జరగకుండా సీసీఎస్ టీంలు పటిష్టమైన చర్యలు చేపట్టారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ సెక్రటరీ అశోక్‌కుమార్, మాజీ సీనియర్ ఐఏఎస్ ఎంజీ గోపాల్, రోడ్ల డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు శ్రీనివాస్, డీఆర్‌ఓ రమాదేవి అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. ఈఓ రాజేంద్రం దగ్గరుండి వీఐపీలకు ఆలయ సంప్రదాయంగా స్వాగతం పలికి వారిని సన్మానించి పూజారుల చేతుల మీదుగా ప్రసాదం అందించారు. జంపన్నవాగు నుంచి మేడారం దారి పొడవునా వాహనాలు బారులుదీరాయి. పోలీసులు వాహనాల్ని పార్కింగ్ స్థలాల్లోకి మళ్లించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకున్నారు. ఆర్టీసీ బస్సులు గద్దెల వరకు రావడంతో ఆర్టీసీ బస్సులో వచ్చిన భక్తులు నేరుగా అమ్మవార్ల గద్దెలకు చేరుకున్నారు. భక్తులు, వీఐపీల రాకతో మేడారం సందడిగా మారింది.

విజేతగా నిలిచిన వాగ్దేవి కళాశాల జట్టుకు కప్ అందజేస్తున్న 'కుడా' చైర్మన్ సుందర్‌రాజ్‌యాదవ్



సాక్షి ట్రోఫీ.. 'వాగ్దేవి' కైవసం



సీనియర్ విభాగంలో రన్నరప్‌గా నిలిచిన నిట్ క్రీడాకారులకు కప్ అందజేస్తూ..



జూనియర్ విభాగంలో రన్నరప్‌గా నిలిచిన ఎల్‌బీ కళాశాల జట్టు

- రన్నరప్‌గా నిలిచిన నిట్ జట్టు
- జూనియర్స్ విజయకేతనం ఎగురవేసిన ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల
- రన్నరప్‌గా లాల్‌బహదూర్ కళాశాల



జూనియర్ విభాగంలో విన్నర్‌గా నిలిచిన ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల జట్టు

రామన్నపేట: వారం రోజులుగా 24 జట్లతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు ఆద్యాంతం ఉత్సాహంగా కొనసాగాయి. యూనివర్సిటీ స్థాయి పోటీలను తలదన్నేలా క్రీడాకారులు రెట్టింపు ఉత్సాహంతో ఇందులో పాల్గొనడంతో సాక్షి క్రికెట్ పోటీలకు అత్యంత ఆదరణ లభించింది. తమ కళాశాల జట్లు విజయం సాధించాలనే తపనలో కళాశాలల యాజమాన్యాలు సైతం క్రీడాకారులను ఉత్తేజపర్చేందుకు ఎల్బీ కళాశాల మైదానానికి చేరుకుని ఆయా సంస్థల యాజమాన్యాలు సైతం మరింత ఉత్సాహాన్ని నింపాయి. శుక్రవారం సీనియర్ విభాగంలో ఫైనల్ మ్యాచ్‌ను ఎల్బీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డీహెచ్.రావు టాస్ వేసి, బ్యాటింగ్ చేసి క్రీడా పోటీలను ప్రారంభించారు. ఫైనల్ మ్యాచ్ నువ్వా..నేనా అనే రీతిలో జరిగింది. నిట్ జట్టుపై వాగ్దేవి జట్టు 10 పరుగుల తేడాతో విజయం సాధించింది. టాస్ గెల్చుకున్న నిట్ జట్టు బౌలింగ్ ఎంచుకోగా మొదట బ్యాటింగ్ చేసిన వాగ్దేవి జట్టు 89 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్ చేసిన నిట్ జట్టు 10 ఓవర్లలో 79 పరుగులు మాత్రమే సాధించగలిగింది. వాగ్దేవి జట్టులో క్రీడాకారుడు సిద్ధార్థ 27 బంతుల్లో 48 పరుగులు సాధించి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కించుకున్నాడు.

జూనియర్స్ విభాగంలో..

సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీల జూనియర్ విభాగంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విజయకేతనం ఎగురవేసింది. ఫైనల్ మ్యాచ్‌లో ఎల్బీ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాల జట్లు తలపడగా టాస్ గెలుచుకున్న పాలిటెక్నిక్ బ్యాటింగ్ ఎంచుకుని 10 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 111 పరుగులు సాధించింది. అనంతరం ఎల్బీ కళాశాల జట్టు 10 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 93 పరుగులు మాత్రమే సాధించగలిగింది. పాలిటెక్నిక్ కళాశాలలో సాయి వంశీ 20 బంతుల్లో 54 పరుగులు సాధించి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.

బహుమతుల ప్రదానం

సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీల్లో విజేతలుగా నిలిచిన జట్లకు 'కుడా' చైర్మన్ సుందర్ రాజు యాదవ్, సాక్షి బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాస్, ఈవెంట్ మేనేజర్ సుమన్, వరంగల్ స్టాఫ్ రిపోర్టర్ వాంకె శ్రీనివాస్, టీవీ కరస్పాండెంట్ విజేందర్‌రెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. ఈసందర్భంగా 'కుడా' చైర్మన్ సుందర్‌రాజు మాట్లాడుతూ.. సాక్షి మీడియా ఆధ్వర్యంలో క్రికెట్ పోటీల నిర్వహణతో యువ క్రీడాకారుల్లో మంచి ఉత్తేజాన్ని నింపారని పేర్కొన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడా స్ఫూర్తితో ముందుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో ఎల్బీ కళాశాల లెఫ్టినెంట్ అధికారి ఎం.సదానందం, కళాశాల పీడీ ప్రభాకర్, వాగ్దేవి కళాశాల యజమాన్య ప్రతినిధి హరేందర్, నిట్ ఫిజికల్ డిపార్టుమెంట్ ప్రతినిధి, క్రీడాకారులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎల్బీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ

యువకుడిపై పోక్సో కేసు

ఆత్మకూరు: మండల కేంద్రానికి చెందిన 17 ఏళ్ల బాలికపై ఇంటి పక్కనే ఉంటున్న యువకుడు మంద సురేందర్ ఈనెల 1న రాత్రి 10 గంటల సమయంలో బాలిక ఇంట్లోకి వెళ్లి ఆమెతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. బాలిక కేకలు వేయగా.. చుట్టుపక్కల వారు, తల్లిదండ్రులు గమనించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా.. మంద సురేందర్‌పై శుక్రవారం పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ గణేశ్ తెలిపారు.

ఎగిసిపడిన అగ్ని కీలలు

- ఓల్డ్ ఫర్నిచర్ షాపులో అగ్ని ప్రమాదం
- ఐదుషాపులకు వ్యాపించిన మంటలు
- 1.37 కోట్ల ఆస్తి నష్టం జరిగినట్లు అధికారుల ప్రాథమిక అంచనా



ఓల్డ్ ఫర్నిచర్ షాపుల్లో ఎగిసిపడుతున్న మంటలు

ఖిలా వరంగల్: వరంగల్ అండర్ బ్రిడ్జి ఇసుక అడ్డా జంక్షన్ సమీపం పెరకవాడలోని ఓల్డ్ ఫర్నిచర్ షాపులో శుక్రవారం తెల్లవారు జామున 3 గంటలకు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో భారీ ప్రమాదం జరిగింది. టేకు కర్ర చెక్కపొడికి షార్ట్ సర్క్యూట్‌తో నిప్పురవ్వలు అంటుకుని అగ్ని కీలలు ఎగసిపడ్డాయి. దీంతో పక్కనే ఉన్న ఐదు ఓల్డ్ ఫర్నిచర్ షాపులు, ఒక బైక్ మెకానిక్ షాపు, పాత సామాన్ల షాపు, ఇల్లు, ఫర్టిలైజర్, పెస్టిసైడ్స్, సీడ్స్ గోదాంలోకి మంటలు వ్యాపించి పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. రూ.5 కోట్లకు పైగా ఆస్తి నష్టం జరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు.

అధికారుల అప్రమత్తం

ప్రమాదం జరిగిన సమయంలో పనికోసం వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులు గాఢ నిద్రలో ఉన్నారు. మంటలు ఎగిసిపడి పొగ కమ్ముకుపోయింది. దీంతో కార్మికులు, స్థానికులు రోడ్లపైకి పరుగులు తీశారు. స్థానికులు మిల్స్‌కాలనీ పోలీసులు, వరంగల్ ఫైర్ అధికారులు అలర్ట్ అయ్యారు. ఆరు ఫైరింజన్లతోపాటు 40 మంది సిబ్బంది మంటలు ఆర్పారు. ఉదయం 4:30 నుంచి దాదాపు 12 గంటలు శ్రమించి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగనప్పటికీ ఆస్తి నష్టం భారీగా జరిగింది. సర్వం కోల్పోయామని, ప్రభుత్వం ఆదుకోవాలని ఎండి అబ్దుల్లా, మాషా అల్లా ట్రేడర్స్, ఏటుజెడ్ ఫర్నీచర్స్, లక్ష్మి వినాయక పాత సమాన్ల షాపు, మహాలక్ష్మి ఆటో మొబైల్ మెకానిక్ షాపు, మాధురి ఏజెన్సీస్ పెస్టిసైడ్స్, సీడ్స్ హోల్‌సెల్, రిటేల్ షాపు నిర్వాహకులు కోరుతున్నారు. కాగా.. ఘటనాస్థలిని అధికారులు పరిశీలించారు. రూ.5కోట్లు ఆస్తి నష్టం జరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు. సుమారు రూ.1.37 కోట్లు ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా వేస్తున్నట్లు వరంగల్ అగ్నిమాపక శాఖ డివిజన్ ఫైర్ అధికారి మామిడి భగవాన్‌రెడ్డి తెలిపారు.

రైల్వే వ్యాగన్ షెడ్‌కు రూ.160కోట్లు

కాజీపేట రూరల్: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కాజీపేట జంక్షన్‌కు రైల్వేపరంగా నిధులు కేటాయించినట్లు రైల్వే అధికారులు తెలిపారు. కాజీపేట రైల్వే వ్యాగన్ పీరియాడికల్ ఓవరాయిలింగ్ షెడ్‌కు 2023-2024 బడ్జెట్‌లో రూ.160కోట్ల కేటాయించినట్లు శుక్రవారం రాత్రి రైల్వే అధికారులు తెలిపారు. రైల్వే పింక్ బుక్‌లో దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ జోన్ పరిధిలో కాజీపేట సబ్ డివిజన్ కేంద్రంలో వివిధ రైల్వే ప్రాజెక్టులకు బడ్జెట్‌లో కేటాయించిన బడ్జెట్ వివరాలు ఇలా ఉన్నాయి. భద్రాచలం-కొవ్వూరు కొత్త లైన్‌కు రూ.20కోట్లు కేటాయించారు. ఈ లైన్ 2012-2013లో 151 కిలోమీటర్ల దూరం వరకు పనులు ప్రారంభించారు. మణుగూరు-రామగుండం కొత్త లైన్ నిర్మాణానికి రూ.10కోట్లు కేటాయించారు. ఈ ప్రాజెక్ట్ 2013-2014లో 200 కి.మీ వరకు ప్రారంభించారు. కాజీపేట-విజయవాడ మూడో లైన్ విద్యుద్దీకరణ పనుల కోసం రూ.337,52కోట్లు కేటాయించారు. 220 కిలోమీటర్ల దూరం వరకు ఈ ప్రాజెక్టును 2012-2013లో ప్రారంభించారు. కాజీపేట-బల్లార్షా మూడో లైన్ నిర్మాణానికి రూ.450.86కోట్లు కేటాయించారు. ప్రాజెక్ట్ 2015-2016లో 201 కిలోమీటర్ల దూరం వరకు ప్రారంభించారు.

కాజీపేట ఎలక్ట్రిక్ లోకోషెడ్, డీజిల్ లోకోషెడ్ అభివృద్ధి

కాజీపేట ఎలక్ట్రిక్ లోకోషెడ్‌లో 125 లోకోల నుంచి 175 లోకోల సామర్థ్యం పెంచనున్నట్లు, అలాగే కాజీపేట డీజిల్ లోకోషెడ్‌లో 100 లోకోల సామర్థ్యం నుంచి 150 లోకోల వరకు పెంచేందుకు నిధులు కేటాయించారు. డోర్నకల్ జంక్షన్‌లో ఫ్రైట్ ట్రెయిన్ ఎగ్జామినేషన్ సెంటర్ ఏర్పాటుకు నిధులు కేటాయించారు.

పెళ్లి చేసుకుంటానని మోసం

- పోలీసులను ఆశ్రయించిన యువతి

వరంగల్ రూరల్: పెళ్లి చేసుకుంటానని నమ్మించి లోబర్చుకుని, ఆతర్వాత నువ్వెవరో నాకు తెలియదు అని దబాయించిన ఓవ్యక్తిపై వరంగల్ సుందరయ్య నగర్‌కు చెందిన రమణబోయిన రవీనా పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు శుక్రవారం రాచమల్ల వివేక్‌పై కేసు నమోదు చేసినట్లు వరంగల్ ఏనుమాముల పోలీస్‌స్టేషన్ ఎస్సై రాజన్‌బాబు తెలిపారు. రవీనాకు తన ఇంటి సమీపంలో ఉండే రాచమల్ల వివేక్ రెండేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఈనేపథ్యంలో అతడు ఆమెను లోబర్చుకున్నాడు. తీరా పెళ్లి చేసుకోమని రవీనా, వివేక్‌పై ఒత్తిడి తేవడంతో వివేక్ అందుకు నిరాకరించాడు. ఈవిషయమై రవీనా తల్లి వివేక్‌ను నిలదీసింది. ఏనుమాముల పోలీస్‌స్టేషన్‌లో బాధిత యువతి వివేక్‌పై ఫిర్యాదు చేసింది.

గంజాయి కేసులో నిందితుడు పరార్

ఖిలా వరంగల్: గంజాయి కేసులో అరెస్టైన నిందితుడిని రిమాండ్‌కు తరలించే క్రమంలో కానిస్టేబుల్ కళ్లు కప్పి హనుమకొండ బస్టాండ్ నుంచి శుక్రవారం సాయంత్రం పారిపోయినట్లు తెలిసింది. ఈ విషయాన్ని మిల్స్‌కాలనీ పోలీసులు గోప్యంగా ఉంచారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిందితుడి కోసం పోలీసులు నాలుగు బృందాలుగా విడిపోయి గాలిస్తున్నట్లు సమాచారం. విశ్వసనీయ సమాచారం మేరకు గీసుగొండ మండలం జాన్‌పాక లక్ష్మీపురానికి చెందిన మహమ్మద్ షహీర్ అలియాస్ షహీర్‌లాల్ (19) డిగ్రీ ఫస్ట్ ఇయర్ చదువుతున్నాడు. గంజాయి విక్రయ కేసులో మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో పట్టుబడినట్లు తెలిసింది. కాగా, అతడిని వరంగల్ కోర్టులో ప్రవేశ పెట్టగా జడ్జి ఆదేశాలతో పరకాల కోర్టుకు తరలించే క్రమంలో పరార్ అయ్యాడు.

'ఎర్రబెల్లి' అభివృద్ధి ఏది?

- అడుగడుగునా 'అరూరి' భూకబ్జాలు
- వైఎస్సార్ టీపీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల



పర్వతగిరిలో మాట్లాడుతున్న షర్మిల

పర్వతగిరి: రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సొంత మండలంలో అభివృద్ధి ఎక్కడా కనిపించడం లేదని వైఎస్సార్ తెలంగాణ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. పర్వతగిరి మండల కేంద్రంలో శుక్రవారం పాదయాత్ర నిర్వహించారు. పాదయాత్రలో ఆమె మాట్లాడుతూ.. మంత్రి దయాకర్‌రావు సొంత గ్రామమైన పర్వతగిరిని ఏమైనా పట్టించుకున్నాడా అని ప్రశ్నించారు. వంద పడకల ఆస్పత్రి కట్టలేదు. డిగ్రీ, ఇంటర్ కాలేజీలు లేవు కానీ ఈయన పంచాయతీరాజ్ శాఖ మంత్రి అంట అని ఎద్దేవా చేశారు. రాష్ట్ర సర్కారు పంచాయతీలకు నిధులు ఇవ్వదని, కేంద్రం నుంచి వచ్చే నిధులు కూడా దక్కనివ్వదన్నారు. స్థానిక ఎమ్మెల్యే అరూరి రమేశ్ సివిల్ కాంట్రాక్టర్‌గా ఉండి ఏ-1 కాంట్రాక్టర్ ఎలా అయ్యాడంటూ ప్రశ్నించారు. ఎమ్మెల్యే అరూరి అడుగడుగునా.. భూ కబ్జాలకు పాల్పడుతున్నారని, అరాచకాలు భరించలేకే వర్ధన్నపేటలో సొంత పార్టీ కౌన్సిలర్లు ఎదురు తిరుగుతున్నారన్నారు. వైఎస్‌ఆర్ హయాంలో వ్యవసాయం పండుగలా ఉండేదని, నేడు కేసీఆర్ పాలనలో దండగలా మారిందన్నారు. వైఎస్సార్‌టీపీని ఆశీర్వదిస్తే వైఎస్ ప్రవేశ పెట్టిన పథకాలను మళ్లీ అమలు చేస్తామన్నారు.

సాఫీగా సాగిన షర్మిల పాదయాత్ర..

నెక్కొండ: వైఎస్.షర్మిల ప్రజాప్రస్థానం యాత్ర నర్సంపేట నియోజక వర్గం పార్టీ కార్యకర్తలు, ప్రజల అండదండలతో పోలీసుల కట్టుదిట్టమైన చర్యల మధ్య శుక్రవారం సాఫీగా సాగింది. ఓపక్క ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎండగడుతూ.. షర్మిల తలపెట్టిన పాదయాత్ర ఉత్కంఠకు తెరపడగా అందరూ ఊపిరి పీల్చుకున్నారు. నెక్కొండలోని వరంగల్ రోడ్డు నుంచి చింత నెక్కొండ క్రాస్ రోడ్డు మీదుగా సాయిరెడ్డిపల్లి, అడ్డబాట (ఏబీ) తండా వరకు పాదయాత్ర సాగింది. తెలంగాణలో వైఎస్సార్‌టీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగ నోటిఫికేషన్‌పైనే తొలి సంతకం చేస్తానని హామీ ఇచ్చారు. పాదయాత్రలో వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధులు పిట్టల రాంరెడ్డి, డాక్టర్ నగేశ్, వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నాడెం శాంతికుమార్, జిల్లా నాయకుడు భూక్యా లాలునాయక్, నర్సంపేట, నెక్కొండ మండలాల అధ్యక్షులు నూనె నర్సయ్య, సురేందర్, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు జాటోతు అశోక్‌నాయక్, అలువాల సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డితోనే మా ప్రయాణం

- 9 నుంచి తూర్పులో సురేఖ పాదయాత్ర
- ప్రెస్‌మీట్‌లో మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి

వరంగల్: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితోనే తమ ప్రయాణం ఉంటుందని, కాంగ్రెస్ పార్టీని వదలబోమని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు అన్నారు. ఈనెల 6నుంచి చేపట్టే 'హాథ్ సే హాథ్ జోడో' యాత్రను విజయవంతం చేసేందుకు హనుమకొండ రాంనగర్‌లోని ఆయన స్వగృహంలో శుక్రవారం ఏర్పాటు చేసిన వరంగల్ తూర్పు ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొండా దంపతులు కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతారని ఎవరు ఎన్ని కల్లబొల్లి మాటలు చెప్పినా నమ్మవద్దని కోరారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కొండా సురేఖ వరంగల్ తూర్పు నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలుస్తారన్నారు. ప్రస్తుతం అధికార పార్టీలో ఉన్న ఎమ్మెల్యేలు, నాయకులంతా భూకబ్జాదారులేనని వచ్చే ఎన్నికల్లో వారికి గుణపాఠం తప్పదన్నారు. ఈనెల 9నుంచి తూర్పు నియోజవర్గంలో గడప గడపకూ పాదయాత్ర చేస్తూ ప్రజల కష్టసుఖాలు తెలుసుకునేందుకు మాజీ ఎమ్మెల్యే కొండా సురేఖ మీ ముందుకు వస్తున్నారన్నారు.

సేవే ముఖ్యం

'నేను ఎర్రబెల్లి దయాకర్‌రావులా మాయమాటలు చెప్పను. మాకు రాజకీయాలు ముఖ్యం కాదు.. ప్రజా సేవే ముఖ్యం' అని కొండా మురళి అన్నారు. వరంగల్ పశ్చిమ, వరంగల్ తూర్పు నియోజకవర్గాల్లో భూ కబ్జాలు చూస్తే బాధేస్తోందని, చివరకు గోపాలపూర్‌లో ఉన్న తన భూమినే ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్ కబ్జా చేయించారని ఆరోపించారు. వరంగల్ సీపీకి సెల్యూట్ చేస్తున్నామని, ఆయన ఇలాగే పనిచేయాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. తమకు ఒక్క టికెట్ చాలని, కొండా సురేఖ పోటీ చేస్తుందని తెలిపారు. రాహుల్ గాంధీ స్ఫూర్తితో వరంగల్ తూర్పులో రోజు ఒక డివిజన్‌లో పాదయాత్ర చేస్తామని, మమల్ని ప్రజలు ఆదరిస్తారని.. మేము ఎప్పుడు అవినీతికి పాల్పడలేదని మురళీ అన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.